క్లుప్తంగా

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

నెల్లూరు (టౌన్): సంక్రాంతి సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో తరగతులను నిర్వహిస్తే అడ్డుకుంటామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాహుల్ పేర్కొన్నారు. నగరంలోని ఏబీవీపీ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. ర్యాంకుల పేరుతో ఫీజులను పెంచి విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

మహిళా వాకర్స్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏసీ స్టేడియం మహిళా వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని నగరంలోని ఓ కల్యాణ మండపంలో స్టేడియం వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరి రావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మహిళా వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వసుంధర, సెక్రటరీ జయరాణి, ట్రెజరర్ మగ్బులా, కార్యవర్గ సభ్యులతో వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ గవర్నర్లు డాక్టర్ అంకిరెడ్డి, రాఘవరెడ్డి, రంగారావు, రఘురామ్ ముదిరాజ్, బలరామనాయుడు, భక్తవత్సలరెడ్డి, అరుణాచలం, భారతి, ఆదిలక్ష్మి, సుశీల, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(సెంట్రల్): మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సంతపేటలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి కుమార్తె దీపావెంకట్ మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. తన ఇంట జరిగే శుభకార్యానికి ఆహ్వానించారు.

రికార్డు స్థాయిలో సభ్యత్వాలు

నెల్లూరు(సెంట్రల్): కోవూరు నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలతో రికార్డును టీడీపీ సృష్టించిందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని తన నివాసంలో సంబరాలను శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు


జెనెక్స్‌లో..


ఎస్వీఎస్ స్కూల్లో..

నెల్లూరు (టౌన్): హరనాథపురంలోని జెనెక్స్ విజన్ విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను శనివారం నిర్వహించారు. భోగి మంటలు, సంక్రాంతి పొంగళ్లు, గంగిరెద్దు ఆటలు, ముగ్గుల పోటీలు, సంప్రదాయ నృత్యాలు, కోలాటాల ప్రదర్శనలను విద్యార్థులు జరిపారు. అనంతరం రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులను జెనెక్స్ విజన్ డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు అందజేశారు.

• శ్రామికనగర్‌లోని ఎస్వీఎస్ స్కూల్లో విద్యార్థుల తల్లులకు రంగవల్లులు, ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. విజయమ్మ, కరస్పాండెంట్ పీపీ రెడ్డి, హెచ్‌ఎం ప్రమీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నారాయణలో..

• నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. అలమ్నీ సమావేశాన్ని పూర్తి విద్యార్థులు ఏర్పాటు చేశారు. తమ అనుభవాలను కొత్త విద్యార్థులతో పంచుకున్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఏజీఎం శ్రీధర్, ఏఓ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఇందూధర్‌రెడ్డికి శ్రద్ధాంజలి



నెల్లూరు(బారకాసు): మాజీ జెడ్పీటీసీ తుంగా ఇందూధర్‌రెడ్డి మృతి చెందడంతో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులతో కలిసి ఆయన ఇంటికెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

• నగరంలోని ఇందూధర్‌రెడ్డి నివాసానికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(బృందావనం): పాత మున్సిపల్ కార్యాలయంలో గల పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో దుప్పట్లను బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ ఆధ్వర్యంలో అందజేశారు. కృపారాజన్, అనితారాయ్, మేరీ సరళ, ప్రభావతి, ఆశ్రమ పర్యవేక్షకుడు సుందరం పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల అందజేత

నెల్లూరు(సెంట్రల్): ఏడుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శనివారం అందజేశారు. కోవూరు నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

ఖాజావలీకి పరామర్శ



నెల్లూరు(బారకాసు): నగరంలోని 15వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఖాజావలీ సతీమణి ఇటీవల మరణించారు. దీంతో ఆయన నివాసానికి ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం వెళ్లి పరామర్శించారు.

హౌసింగ్ అధికారులతో సమావేశం

నెల్లూరు(సెంట్రల్): కోవూరు నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల కేటాయింపుల్లో ఎక్కడైనా అవకతవకలు జరిగి ఉంటే సరిదిద్దాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

యువతి ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు సిటీ: యువతి ఆత్మహత్య ఘటనలో నిందితుడ్ని నెల్లూరు రూరల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. రూరల్ మండలంలోని గుడిపల్లిపాడు నేతాజీనగర్‌కు చెందిన దార్ల పావని ఈ నెల ఏడున ఆత్మహత్యకు పాల్పడ్డారు. తమ కుమార్తె ఆత్మహత్యకు గ్రామానికి చెందిన గెర్రి వెంకటరమణయ్య వేధింపులే కారణమని అదే రోజున పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితుడ్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు.

డైరీ ఆవిష్కరణ

నెల్లూరు(క్రైమ్): జిల్లా పోలీస్ అధికారుల సంఘం రూపొందించిన పోలీస్ డైరీ, పోలీస్ క్యాలెండర్లను ఎస్పీ కృష్ణకాంత్ శనివారం ఆవిష్కరించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, ఏఓ చంద్రమౌళి, డీఎస్పీలు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, రాజగోపాల్, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, అసోసియేషన్ కోశాధికారి తురకా శ్రీనివాసులు, సభ్యులు పెంచలప్రసాద్, మదన్ పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. నగరంలోని హెచ్‌ఎన్నార్ రెసిడెన్సీలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అల్తాఫ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, తెలంగాణ విద్యుత్ సంస్థ డైరెక్టర్ నందకుమార్, అసోసియేషన్ నేతలు బాషా, అల్తాఫ్, యూసఫ్, నవాజ్‌జానీ, రఫీ, నస్రూల్లా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ల విక్రయం ద్వారా రూ.13.88 లక్షలు

నెల్లూరు(బృందావనం): ముక్కోటి ఏకాదశి సందర్భంగా నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో టికెట్ల విక్రయం ద్వారా రూ.13,88,650 సమకూరిందని ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ల విక్రయం ద్వారా గతేడాది రూ.11,28,200 రాగా, ఈ ఏడాది రూ.2,60,450 అధికంగా వచ్చిందని తెలిపారు.

మంత్రుల భేటీ

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం భేటీ అయ్యారు. వివిధ అంశాలపై వీరు చర్చించారు.

వడ్డే ఓబన్నకు నివాళులు


ఎస్పీ కార్యాలయంలో..

నెల్లూరు(క్రైమ్): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న ధైర్య సాహసాలు, పోరాటపటిమ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓబన్న జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీసీఓ కార్యాలయంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. డీసీఓ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి శేషసాయి కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. అమ్మవారు, దేవస్థాన ప్రాంగణంలోని మీనాక్షి సుందరేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలు, పట్టువస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనాలను అందజేశారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగరంలో మంత్రి పర్యటన



నెల్లూరు(సెంట్రల్): నగరంలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేపల మార్కెట్ సమీపంలో గోవులను కొంతమంది వధిస్తున్నారనే విషయం తెలిసిందని, వీరు తక్షణమే ఖాళీ చేసి వెళ్లాలని ఆదేశించారు. మార్కెట్లో ఉన్న వారికి ఎలాంటి ఇబ్బందులుండవని భరోసా ఇచ్చారు. అన్న క్యాంటీన్లలో నాణ్యత సక్రమంగా లేదనే ఫిర్యాదులొస్తున్నాయని, అలాంటివి ఉండే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రూరల్ ప్రాంతాల్లో 67 అన్న క్యాంటీన్లను త్వరలో ప్రారంభించనున్నామని ప్రకటించారు.

సేవాభావంతో పార్కులను అభివృద్ధి చేయాలి
నగరంలోని కాంట్రాక్టర్లు సేవాభావంతో ముందుకొచ్చి పార్కుల అభివృద్ధికి సహకరించాలని మంత్రి నారాయణ కోరారు. ఏసీ సెంటర్‌లో మదీనా వాచ్ కంపెనీ ఆధ్వర్యంలో చేపడుతున్న పార్కును పరిశీలించారు. ఆనం రంగమయూర్‌రెడ్డి, మదీనా వాచ్ అధినేత ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని కలిసిన వెంకటశేషయ్య



నెల్లూరు(బారకాసు): వెంకటాచలం మాజీ జెడ్పీటీసీ మందల వెంకటశేషయ్య బెయిల్‌పై విడుదలైన అనంతరం మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్‌రోడ్డులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

నివాళి
రాజరాజేశ్వరి దేవస్థాన మాజీ చైర్మన్ కోడూరు రాఘవరెడ్డి పెద్దకర్మను నిర్వహించారు. ఈ క్రమంలో పోస్టల్ కాలనీలోని ఆయన ఇంటికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వ్యాపారాభివృద్ధిలో రయ్..రయ్

నెల్లూరు(బారకాసు): వ్యాపారాభివృద్ధిలో నగరం పరుగులు తీస్తోంది. శుభకార్యాలకు అవసరమైన వస్త్రాలు, బంగారు ఆభరణాలు తదితరాలను కొనుగోలు చేయాలంటే చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు గతంలో వెళ్లాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం ఇక్కడే అన్నీ లభ్యమవుతున్నాయి. ఫలితంగా కొనుగోళ్ల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి పలువురు ఇక్కడికి వస్తున్నారు. ప్రస్తుతం వ్యాపార రంగానికి కేరాఫ్‌గా సింహపురి నిలుస్తోంది. రియల్ ఎస్టేట్‌తో పాటు బంగారం, సిమెంట్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ ఇలా అనేక వ్యాపారాలు సింహపురిలో అందుబాటులో ఉన్నాయి.

అన్ని రంగాల్లో ముందంజ
విద్యారంగంలో నెల్లూరు ముందంజలో ఉంది. ఇక్కడ వందల సంఖ్యలో ప్రైవేట్ విద్యాసంస్థలున్నాయి. పేరెన్నిక కలిగిన ప్రముఖ విద్యా సంస్థల్లో ఇతర జిల్లాల వారు విద్యనభ్యసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను పొందేందుకు సంబంధించిన కోచింగ్ సెంటర్లకూ సింహపురిలో కొదవలేదు. బంగారు ఆభరణాల తయారీకి పెట్టింది పేరు నెల్లూరు. నిత్యం ఇక్కడ బంగారం విక్రయాలు కోట్లల్లో జరుగుతాయి. బంగారం దుకాణాలకు మండపాలవీధి ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆభరణాలు తయారీ చేసే వారిలో అన్ని వర్గాల వారు ఉండటం మరో విశేషం.

కొత్తగా.. కొంగొత్తగా
మహానగరాలకు దీటుగా నగరంలో అనేక ఫంక్షన్ హాళ్లు వెలుస్తున్నాయి. ఇంద్ర భవనాల తరహాలో వీటిని తీర్చిదిద్దుతున్నారు. వీటి అద్దె లక్షల్లో ఉన్నా, తమ పిల్లల వివాహాలు అక్కడే చేసేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతున్నారు. సమావేశాలతో పాటు ఇతర శుభకార్యాలకూ ఇవి వేదికగా మారుతున్నాయి.

నిత్యం సందడే..
మహానగరాలకు దీటుగా ఇక్కడ వస్త్ర షాపులు, ఎలక్ట్రానిక్ షోరూమ్‌లు ఎన్నో ఉన్నాయి. ట్రంక్‌రోడ్డు, కాపువీధి, మినీబైపాస్ రోడ్డులోని ఈ షాపుల్లో నిరంతరం సందడి నెలకొంటోంది. నెల్లూరులో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నాయి. ఫలితంగా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోంది.

వాహనాల పరుగులు
గతంలో వాహనాలను కొనుగోలు చేయాలంటే నెల్లూరీయులు రాష్ట్రంలో పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. వాహనాన్ని బుక్ చేసి దాని స్థితిగతులను ఆరాతీసేందుకు ఫోన్లను ఆశ్రయించాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం ఎన్నో షోరూమ్‌లు నెల్లూరులో వెలిశాయి. ఇలా నెల్లూరు అన్ని రంగాల్లో పరుగులు తీస్తోంది.

రియల్ వెంచర్లతో కళకళ
నగరంలో రియల్ ఎస్టేట్ రంగం ఆశాజనకంగా ఉంది. గతంలో ఐదు లక్షలున్న జనాభా ప్రస్తుతం పది లక్షలకు చేరువలో ఉంది. ఫలితంగా నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. మినీబైపాస్ రోడ్డు, పొదలకూరు రోడ్డు, కొత్తూరు, మైపాడు రోడ్డు, నాలుగో మైలు, ధనలక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలు జరగడంతో కోలాహలం నెలకొంటోంది.

14న కర్పూర జ్యోతి దర్శనం

నెల్లూరు(బృందావనం): భోగిని పురస్కరించుకొని నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థాన ప్రాంగణంలో గల గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని సోమవారం ఉదయం నిర్వహించనున్నామని అయ్యప్ప సేవా సమాజ కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మకర సంక్రాంతిని పురస్కరించుకొని అయ్యప్పస్వామికి నెయ్యాభిషేకాలు, మహాదీపారాధన, కర్పూర జ్యోతి దర్శన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు నెల్లూరీయులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జాతీయ స్థాయి పాఠశాలల చెస్ పోటీలకు నగరంలోని రాయ్ చెస్ అకాడమీ క్రీడాకారులు సాత్విక్, గానవి ఎంపికయ్యారని చెస్ సెలక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్ అజీజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలో నిర్వహించిన జాతీయ పాఠశాలల చెస్ అర్హత పోటీల్లో అండర్ - 10 బాలుర విభాగంలో సాత్విక్, బాలికల విభాగంలో గానవి ప్రతిభ చూపి ఎంపికయ్యారని వివరించారు. క్రీడాకారులను శిక్షకులు మౌనిక, షామీర్, షబ్బీర్ అభినందించారు.

15న తెప్పల పోటీలు

నెల్లూరు(బృందావనం): సంక్రాంతిని పురస్కరించుకొని లేక్‌వ్యూ కాలనీ సమీపంలోని నెల్లూరు చెరువులో మత్స్యకారులకు పడవలు, తెప్పలు.. మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించనున్నామని నిర్వాహకుడు బర్నబాస్ తెలిపారు. లేక్‌వ్యూ కాలనీలోని 15వ వీధిలో చెరువు వద్ద మత్స్యకారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగవల్లుల పోటీలను ఈ నెల 14న.. తెప్పల పోటీలను 15న నిర్వహించనున్నామని వివరించారు. చెరువులో సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో పోటీలు జరగనున్నాయని తెలిపారు. చంద్ర, కుమార్‌రాజా, సిద్ధూ, గురుమూర్తి, ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(అర్బన్): నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో గల జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ట్రెజరీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జాలాది కరుణ వ్యవహరించారు.

అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా యడవల్లి దయాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జిలానీబాషా, ఉపాధ్యక్షులుగా వెంకటరమణరావు, అబ్దుల్ అలీం, వివేక, కార్యదర్శిగా బూడిద శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కిరణ్, జాయింట్ సెక్రటరీలుగా కోసలరామ్, కంటసాయి శ్రీవాత్సవ్, జిల్లా ట్రెజరర్‌గా వాకాటి రాజేష్‌బాబు ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు.